"మరి మీ విలువైన కాలాన్ని ఆవిడ దగ్గర కూర్చుని ఎందుకు వృధా చేసుకుంటున్నారు?"

"దాన్ని దయ అంటారు. భగవత్ భక్తులు దయగా జీవించాలి కాబట్టి." జవాబు చెప్పాడు సన్యాసి.

## 182. కదలద్దు

ఓ తాత్వికుడు దగ్గరకి కొందరు జిజ్ఞాసువులు వెళ్ళి అతన్ని ఏదైనా ఉపదేశం చెప్పమని కోరారు. అటూ, ఇటూ పచార్లు చేస్తున్న ఆయన కొద్దిసేపు ఆలోచించి కూర్చున్న వాళ్ళతో చెప్పాడు.

"కదలకండి."

"అదేమిటి? మేమెవరం నడవడం లేదు. కూర్చునే వున్నాం. మీరు కదా నడిచేది?" అర్థంకాక అడిగారు వాళ్ళు.

"నా కాళ్ళు కదులుతున్నాయి. కానీ నా మనసు నిశ్చలంగా వుంది. మీ కాళ్ళు నిశ్చలంగా వున్నా, మీ మనసు అన్ని వేళలా ఆశతో, ద్వేషంతో, కోపంతో, సంతోషంతో, దుఃఖంతో, కోరికలతో కదులుతూనే వుంది. నా మనసు విషయంలో నేను నిశ్చలంగా వున్నట్లుగా మిమ్మల్నీ ఉండమంటున్నాను." వివరించాడు ఆ తాత్త్వికుడు.

## 183. ఏకాగ్రత

కొత్తగా ఓ మఠంలో చేరిన ఒకతను ధ్యాన సమయంలో కళ్ళు మూసుకుని దేవుడ్ని మనో నేత్రంతో చూసే ప్రయత్నం చేసేవాడు. ప్రధాన శిష్యుడు ధ్యానం చేసే మిగిలిన శిష్యుల దగ్గరకి వచ్చినప్పుడు వారంతా ఆయన పాదాలకి నమస్కారాలు చేసేవారు. కొత్త శిష్యుడు ఈ పని చేయకపోవడంతో మిగిలిన శిష్యులు గురువుకి అతని మీద ఫిర్యాదు చేసారు. గురువు అతన్ని పిలిపించి ఆ ఫిర్యాదుని ప్రస్తావించి అడిగాడు.

"వీళ్ళు చెప్పింది నిజమైతే నీ వివరణని చెప్పు."

"అది నిజమే గురుదేవా. నన్ను తప్పు పట్టేవారి దృష్టి ధ్యాన సమయంలో నాలా భగవంతుడి మీద ఏకాగ్రతగా వుంటే చుట్టుపక్కల జరిగేది గమనించేవారు కారు. ఆ సమయంలో నా దృష్టి ఆ పరమాత్ముడి మీదే వుంది కాబట్టి నేను నా దగ్గరకి వచ్చిన ప్రధాన శిష్యుడ్ని గమనించలేదు."

గురువు మిగిలిన శిష్యుల వైపు తిరిగి మందలింపుగా చెప్పాడు.

"విన్నారుగా? నేర్చుకోండి."

## 184. బ్రహ్మజ్ఞాని

"స్వామీ! మీరు ఆత్మ సాక్షాత్కారం పొందక మునుపుకి, ఇప్పటికి ఏమిటి తేడా?" ఒకరు ఓ బ్రహ్మజ్ఞానిని అడిగాడు.

ఆయన కాసేపు అతని వంక చూసి జవాబు చెప్పాడు.

"ఆత్మ సాక్షాత్కారం పొందక మునుపు నేను ఈ చెరువులో స్నానం చేసి, నా బట్టలని పిండి నేనే ఆరేసుకునేవాడిని. ఆత్మ సాక్షాత్కారం అయ్యాక కూడా నేను ఈ చెరువులో స్నానం చేసి, నా బట్టలని పిండి నేనే ఆరేసుకుంటున్నాను."

## 185. వహామ్యహమ్

కనకదాసు అనే శ్రీకృష్ణ భక్తుడు నిత్యం నిశ్చల భక్తితో గీతాపారాయణం చేయకుండా ముద్ద ముట్టేవాడు కాడు. పేరులో వున్న ఐశ్వర్యం అతనికి జీవితంలో లేదు. భిక్షాటనతో జీవించేవాడు.

గీతలోని 'అనన్యాశ్చింతయంతోమాం...' శ్లోకం అతనికి బాగా ఇష్టమైన శ్లోకం. ఓ సారి అతనికి వరసగా నాలుగు రోజులు భిక్ష లభించలేదు. పిల్లలు ఆకలితో అలమటించడం చూసి బాధ పడ్డ కనకదాసు ఆ రోజు గీతా పారాయణాన్ని చేస్తుంటే, ఆ శ్లోకంలోని 'యోగక్షేమమ్ వహామ్యహమ్' అనే